## క్లుప్తంగా...

### సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

**హబ్సిగూడ:** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శనివారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చెక్కులను అందచేశారు. బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం భాస్కర్‌రెడ్డి, సుధాకర్, సంతోష్‌రెడ్డి, శ్రీధర్, పరమేష్, బాలరాజు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు శంకుస్థాపనలో మేయర్ బుచ్చిరెడ్డి

**బోడుప్పల్:** మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. చెంగిచర్ల 3వ డివిజన్ పరిధిలోఆర్టీసీ కాలనీలో రూ 5.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, రూ.5 లక్షలతో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం, ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్‌లో మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### 5న విహారికి అనుమాండ్ల భూమయ్య పురస్కారం

**ఉప్పల్:** పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ అనుమాండ్ల భూమయ్య సాహిత్య పురస్కారాన్ని ఈనెల 5వ తేదీన నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో అందజేయనున్నట్లు భూమయ్య శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి విహారి (జెఎస్ మూర్తి)కి ఈ పురస్కారం అందించడానికి పాల్కూరికి పీఠం నిర్ణయించినట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రో.తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన నిపుణుల కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పురస్కారంతో పాటు రూ.10 వేల నగదు, జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు. విహారి శ్రీపద చిత్ర రామాయణం, ఆరున్నర వేల పద్యాల మహాకావ్యాన్ని రచించారని, యోగ వాసిష్టసారం లాంటి అనేక కావ్యాలు రచించారు. కథా నవల రచయితగా సుప్రసిద్ధులని తెలిపారు.

### వేంకటేశ్వరుడి సేవలో బీఎల్ఆర్

**కాప్రా:** కుషాయిగూడలోని శ్రీవెంకటేశ్వర స్వామిని శనివారం ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న బీఎల్ఆర్‌కు అర్చకులు స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నృత్యం

**ఉప్పల్:** ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేముల రాధిక శిష్యబృందం చే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన కొనసాగింది. వినాయక కౌతం, కృష్ణ శబ్దం, రామాయణ శబ్దం, బ్రహ్మాంజలి, మూషిక వాహన, గంగం గణపతి, తరంగం తదితర అంశాలను కుమారి మోక్షిత, నక్షత్ర, వన్యశ్రీ అతిథి, శ్రీనిక, నిత్య, రాధిక, సంహిత ప్రదర్శించి మెప్పించారు.

### జన్మదిన వేడుకల్లో డాన్స్ చేస్తూ..

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత జీడీ శ్రీనివాస్‌గౌడ్ మృతి



**గౌతంనగర్:** మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత జీడీ శ్రీనివాస్‌గౌడ్ శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు మల్కాజిగిరిలోని షికారి మల్లయ్య గార్డెన్స్‌లో జరిగాయి. ఈ వేడుకలను దగ్గరుండి పర్యావేక్షించిన శ్రీనివాస్‌గౌడ్ సంతోషంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నగరంలోని కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు శ్రీనివాస్ మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని మల్కాజిగిరిలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

# ఒకే గదిలో.. శిక్షణ



ఇందిరానగర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో మూడు తరగతులకు ఒకే గది



రాజేంద్రనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో విద్యార్థులు



శిథిలావస్థకు చేరుకున్న ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల

- ఒకే గదిలో మూడేసి తరగతులు నిర్వహిస్తున్న వైనం
- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత
- పాఠాలు అర్థం కాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**రామంతాపూర్:** ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రతి పాఠశాలను కార్పొరేట్ స్థాయికి తీసుకువెళ్తున్నామని చెబుతుంటే.. రామంతాపూర్‌లో అందుకు భిన్నంగా పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సౌకర్యాలు లేకపోవడమే కాకుండా సరిపోయేంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో ఒక గదిలో అన్ని తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పోసొప్పో చేసి తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రామంతాపూర్ పరిధిలోని స్కూళ్ల దుస్థితి..**

- వెంకట్‌రెడ్డినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. 62 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో 1 నుంచి 3వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను ఒక గదిలో, నాలుగు నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను మరో గదిలో కూర్చోబెట్టి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- స్థానిక ప్రగతినగర్, రాజేంద్రనగర్, ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి ఉంది. రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతిలో వంద మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం ముగ్గురే ఉపాధ్యాయులు ఉండటంతో 1, 2, 3వ తరగతులను ఒకే గదిలో, అదే విధంగా 4, 5 తరగతుల విద్యార్థులను మరో గదిలో ఒకే చోట కూర్చోబెట్టి బోధిస్తున్నారు.
- ఇందిరానగర్ ఈద్గా మైదానంలో ఉన్న ఉర్దూ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరుకుంది. 62 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కూడా అదే పరిస్థితి ఉంది. ఉపాధ్యాయులు తగినంత మంది లేకపోవడంతో విద్యార్థులను ఒక గదిలో ఉంచి బోధిస్తున్నారు. ఈ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతతో పాటు ఇతర అసౌకర్యాల గురించి మండల విద్యాధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**“ ఉపాధ్యాయులను నియమించాలి**



రామంతాపూర్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యార్థులందరినీ ఒకే గదిలోకి చేర్చి పాఠాలు బోధించడం వల్ల విద్యార్థులకు పాఠాలు అర్థం కావడం లేదు. అదేవిధంగా కొన్ని ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ స్కూళ్లకు పంపలేక చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటుకు పంపుతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు స్పందించాలి.

– ఎర్రం శ్రీనివాస్, సీపీఎం కార్యదర్శి

## ఘనంగా నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు



డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**అల్వాల్/గౌతంనగర్:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య మల్కాజిగిరిలోని షికారి మల్లయ్య గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. మల్కాజిగిరి నియోజకవర్గంతో పాటు మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎతుల ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా అల్వాల్ నుంచి భారీ ర్యాలీగా యాప్రాల్, నేరేడ్‌మెట్, సఫీల్‌గూడ, మల్కాజిగిరి చౌరస్తా, మిర్జాల్‌గూడ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఆయనకు పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. భారీ గజమాలతో సన్మానించారు.



అల్వాల్‌లోని ర్యాలీలో గజమాలతో నందికంటి శ్రీధర్‌కు సత్కరిస్తూ..

## ‘డబుల్’ రచ్చ..

**కాప్రా:** రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్‌లో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ తీవ్ర ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. కాప్రా డివిజన్ సాయిరాంనగర్‌లో నిర్మించిన డబుల్ బెండ్ రూం ఇళ్ల పంపిణీని శనివారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రారంభించారు. ఇళ్ల పంపిణీకి ముందే స్థానికులు ఆందోళనకు దిగారు. ఇక్కడ ఏళ్ల తరబడి ఉంటున్న నిరుపేదలను కాదని స్థానికేతరులకు ఇక్కడ ఇళ్లు కేటాయించారని స్థానికులు ఆందోళన చేపట్టారు. ఇక్కడ నిర్మించిన ఇళ్లను స్థానికులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. స్థానికుల నుంచి నిరసన తీవ్రతరం కావడంతో పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి వారిని పీఎస్‌కు తరలించారు పోలీసులు.



సాయిరాంనగర్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు

# కేసీఆర్‌ది జనరంజక పాలన

మేయర్ విజయలక్ష్మి



లబ్ధిదారుకు ఇంటి పత్రాలు అందిస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

**కాప్రా:** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ జనరంజక పాలన అందిస్తున్నారని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం కాప్రా సర్కిల్‌లో పర్యటించిన ఆమె సాయిరాంనగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేశారు. కాప్రా డివిజన్ సాయిరాంనగర్‌లో సుమారు రూ. 66 కోట్లతో మొత్తం 6 బ్లాకులుగా 9 అంతస్తుల్లో ఒక్కో బ్లాక్‌కు 126 ప్లాట్ల చొప్పున 756 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. మొదటి దశలో 500 ఇళ్లను లబ్ధిదారులకు మేయర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చాలని, వారు ఆత్మగౌరవంతో జీవించాలని సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించారని తెలిపారు. దశలవారీగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. ప్రజలు సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి, బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయం ఇవ్వాలని కోరారు.

**దశలవారీగా అందరికీ ఇళ్లు: ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్‌లో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఇళ్లు వచ్చిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దశలవారీగా అందరికీ ప్రభుత్వం ఇళ్లు కేటాయిస్తుందన్నారు.

### ఎమ్మెల్యేకు వినతి

**హబ్సిగూడ:** నాచారం ఓల్డ్ విలేజ్ సీనియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు భవనం నిర్మించాలని శనివారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రేమ్‌కుమార్, సాయిబాబా, శ్రీశైలం, పాండురంగం, రామచంద్రమూర్తి, రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం భాస్కర్‌రెడ్డి, గరిక సుధాకర్, వేముల సంతోష్‌రెడ్డి, శ్రీధర్, పరమేష్, బాలరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



పండ్లు పంపిణీ చేస్తున్న కుసుగుండ్ల కుసుమకుమార్‌రెడ్డి

**అల్వాల్:** దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ టీపీ నేత కుసుగుండ్ల కుసుమకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం యాప్రాల్‌లోని ఆయన నివాసంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు సుజాత, మాణిక్‌రెడ్డి, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

**గౌతంనగర్:** మిర్జాల్‌గూడ చౌరస్తాలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి టీపీసీసీ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ బోనగిరి సురేష్ యాదవ్ శనివారం నివాళులర్పించారు. నాయకులు మోహర్‌బాబు, యాదగిరి, రమేష్, ప్రసాద్, తిరుపతి, ప్రభు తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు తదితరులు


మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**గౌతంనగర్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని రాజా శ్రీనివాసనగర్, న్యూ మధుసూదన్‌నగర్ తదితర ప్రాంతాల్లో రూ.8 లక్షలతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేంకుమార్, జలమండలి సీఎం సునీల్ కుమార్, మేనేజర్ నవీన్, సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సాయినగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ప్రణవ్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ మేకల సునీతయాదవ్‌లు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే**

**మల్కాజిగిరి:** మల్కాజిగిరి వెంకటేశ్వరనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధనోత్సవాల సందర్భంగా జరిగిన పూజల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, పిట్ల శ్రీనివాస్, రంగా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గజదొంగ అరెస్ట్



యోగేందర్

**మల్కాజిగిరి:** వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి శాస్త్రినగర్‌కు చెందిన మాల యోగేందర్(45) కూలి పని చేస్తూ ప్రస్తుతం నేరేడ్‌మెట్ పరిధిలోని మూడుగుళ్ల ప్రాంతంలో నివాసముంటున్నాడు. తన 18 ఏట నుంచే వ్యసనాలకు బానిసైన యోగేందర్ దొంగతనాలకు పాల్పడడం ప్రారంభించాడు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో సుమారు 42 దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇటీవల జైలు నుంచి తిరిగి బయటకు వచ్చిన యోగేందర్ అతని స్నేహితుడు ఆటో డ్రైవర్ వినయ్‌కుమార్(29) సహకారంతో దొంగతనాలు చేయడం తిరిగి ప్రారంభించాడు. గత నెల 28వ తేదీన మల్కాజిగిరి గౌతంనగర్‌కు చెందిన పవన్‌కుమార్ ఇంట్లో దొంగతనం చేయడంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 2వ తేదీ దయానంద్ నగర్ రైల్వే స్టేషన్‌వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న యోగేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో దొంగతనం ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి కొన్ని వెండి పూజా వస్తువులు, రెండు తులాల బంగారు లాకెట్ స్వాధీనం చేసుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

### ఆలయానికి సౌండ్ సిస్టమ్ విరాళం

**మల్లాపూర్:** మహారాష్ట్రలోని షిర్డీ దేవస్థానంలోని పంచముఖ విష్ణు గణపతి దేవాలయానికి నాచారం చెందిన బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెనోఖర్ రూ.51 వేలు విలువ చేసే హౌజా కంపెనీకి చెందిన సౌండ్ సిస్టమ్‌ను దేవాలయం కమిటీ చైర్మన్ కృష్ణారావుకు అందజేశారు. కార్యక్రమంలో మాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, సుగుణాకర్‌రావు, షేక్ రఫిక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్ఎల్ మాల్ వద్ద బిగ్ స్క్రీన్

**ఉప్పల్:** ఇండియా పాకిస్థాన్ జట్ల మధ్య శనివారం జరుగుతున్న మ్యాచ్‌ను అభిమానులు బిగ్ స్క్రీన్‌లో తిలకించే విధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. వందలాది అభిమానులు అక్కడికి చేరుకుని వీక్షించారు.

### లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే





**ఉప్పల్:** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేని విద్యార్థుల ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ప్రోవేన్షియల్ బ్రదర్ జైకో హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్‌ఫోర్టు సంస్థలు క్రమశిక్షణకు మారుపేరన్నారు. ఇక్కడి విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. అనంతరం ప్రథమ సంవత్సర విద్యార్థులకు మిస్ అండ్ మిస్టర్ పోటీలను నిర్వహించి విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

### వినాయక్‌నగర్‌లో మేరీ మాటీ- మేరీ దేశ్



**మౌలాలి:** మేరీ మాటీ– మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం వినాయక్‌నగర్ డివిజన్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మట్టి సేకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు హాజరై మాట్లాడుతూ.. మన అమర జవాన్లను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేరీ మాటి – మేరీ దేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓంప్రకాష్, సంతోష్‌కుమార్, ఆవుల సంతోష్‌యాదవ్, లలిత, కిరణ్, మహేష్, సదానందగౌడ్, రమేష్‌గౌడ్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.